ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 12 నవంబరు 2024





సుక్కేద్దామంటే సిక్కలేదే..!

మద్యం బాటిల్‌తో మర్కటం కుస్తీ

(6లో...)



నాడు: ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ప్రాజెక్టులను విస్మరించిన ప్రభుత్వ తీరును తూర్పారబట్టారు. తాము అధికారంలోకి రాగానే పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బడ్జెట్‌లో ఆ మేరకు నిధులు కేటాయిస్తామని అన్నారు. ఉమ్మడి జిల్లా రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

నిధుల వరద

సాగునీటి ప్రాజెక్టులకు రూ.1077 కోట్లు



నేడు: టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాజెక్టులకు నిధులను కేటాయించారు. అసెంబ్లీలో ఆర్థిక పయ్యావుల కేశవ్ సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2024-25లో కరువు జిల్లాకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. అనంత అంటే తనకు ఎనలేని అభిమానమని ఉమ్మడి జిల్లాకొచ్చిన ప్రతి సందర్భంలోనూ చంద్రబాబు చెబుతుంటారు. బడ్జెట్‌లో నిధులు ఆయన మాటలు అక్షర సత్యాలని చెబుతున్నాయి.



సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలు వైట్‌వాష్ చేశాయి. ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను గెలిచి.. ఏకపక్ష విజయాన్ని సాధించాయి. అంతటి విజయాన్ని అందించిన ప్రజల అభివృద్ధికి పాటుపడాలని, వారి రుణాన్ని తీర్చుకోవాలని ప్రజా ప్రతినిధులు సంకల్పించారు. సమష్టిగా కదిలి నిధులు సాధించారు. ఆర్థిక మంత్రి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తన సొంత జిల్లాకు న్యాయం చేశారు. తన బడ్జెట్‌లో అనంత ప్రాజెక్టులకు అత్యధిక నిధులు ఇచ్చారని అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం (6లో)

- వ్యవసాయ పథకాలకు భారీగా కేటాయింపులు
- నైపుణ్య శిక్షణకు ప్రత్యేక కేంద్రాలు
- బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట
- ఉమ్మడి జిల్లా రుణం తీర్చుకునేలా బడ్జెట్





అద్భుతమైన బడ్జెట్..

అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ రూపొందించారు. ఇదివరకూ ఎన్నడూ చూడని అద్భుతమైన బడ్జెట్ ఇది. వైసీపీ పాలనలో ప్రజలు, రైతుల సంక్షేమాన్ని విస్మరించారు. ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయలేదు. చంద్రబాబుకు ఈ జిల్లాపై అపారమైన అభిమానం ఉంది. ఆ అభిమానాన్ని సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో స్పష్టంగా చూపారు. జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు అన్ని విధాలుగా బడ్జెట్ కేటాయింపులున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రజారంజక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది.

- వెంకటశివుడు యాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

కోతల బడ్జెట్..

ఇది కోతల బడ్జెట్. కేటాయింపులు అరకరగానే ఉన్నాయి. సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించి ఎక్కువ భాగం కోతలే ఉన్నాయి. మేనిఫెస్టోలో రైతులందరికీ అన్నదాతా సుఖీభవ కింద రూ.20వేలు అందేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 52 లక్షల పైచిలుకు రైతులకు అందజేయడానికి రూ.10వేల కోట్లు కావాలి. కానీ రూ.4వేల కోట్లే విదిల్చారు. ఇది మోసం చేయడమే. నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తామన్నారు. కానీ బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. మహాశక్తి కింద 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. బడ్జెట్‌లో చూపించలేదు. తల్లికి వందనం నిధులను నాలుగైదు వేల కోట్లకే పరిమితం చేశారు. కానీ 84 లక్షల మంది పైగా విద్యార్థులకు అధిక మొత్తం అవసరం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా కనిపించే పరిస్థితి లేదు. ఇది సామాన్యులకు ఉపయోగపడే బడ్జెట్ కాదు. కూటమి ప్రభుత్వం అనుకూల బడ్జెట్.

- అనంత వెంకటరామిరెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు



కసాపురంలో తిరుమంజన స్నపనం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లుటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా తిరుమంజనస్నపనం నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో అర్చకులు ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి పూజలు, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

మౌలానా సంస్కరణలు ఆదర్శం



క్లాక్ టవర్ వద్దనున్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ, కలెక్టర్, మేయర్, డిప్యూటీ మేయర్, టీడీపీ నాయకులు

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ఆజాద్ ఆశయాలను నిజం చేయాలి: కలెక్టర్

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ తీసుకొచ్చిన సంస్కరణలు నేటి తరానికి కూడా ఆదర్శంగా నిలిచాయని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కొనియాడారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీతోపాటు కలెక్టర్ వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా క్లాక్‌టవర్ వద్ద ఉన్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆజాద్ తీసుకొచ్చిన సంస్కరణల స్ఫూర్తితో మైనార్టీ విద్యార్థులను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చిందన్నారు. ఇప్పటికే ఇమామ్, మౌజాన్‌లు, పాస్టర్లకు వేతనాలు అందించారన్నారు. పలువురు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్లు అందించారన్నారు. అనంతరం జడ్పీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను నేటితరం వారు నిజం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 4996 మంది మైనార్టీల కోసం ట్యూషన్ ఫీజు రూ. 4.79 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద 4014 మందికి రూ. 2.77 కోట్లు, విదేశీ విద్య ఒక్కరికి రూ. 26.16 లక్షలు, పాస్టర్లకు గౌరవ వేతనం 235 మందికి రూ. 1.41 కోట్లు, 298 మంది ఇమామ్, మౌజాన్లకు రూ. 5.36 కోట్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ముతవల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షకీల్‌షఫి, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రామసుబ్బారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొయిద్దీన్, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైపుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిగా తీసుకుందాం: జగదీష్, ఎస్పీ



పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం: దేశానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని జిల్లా ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రమణమూర్తి, ఇలియాస్‌బాషా, సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, హరినాథ్, వెంకటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఏం చేస్తే స్పందిస్తారో..?

ప్రభుత్వ ఆస్తిని అమ్మేశానని బహిరంగంగా జిల్లా స్థాయి అధికారి చెబుతున్నా ఎలాంటి చర్యలు లేవు. నిధుల దుర్వినియోగం జరిగింది క్రిమినల్ కేసులు నమోదు చేయండన్న ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర య్యాయి. మరి ఏమి చేస్తే చర్యలు తీసుకుంటారో? మిగిలిన ప్రభుత్వ సామగ్రి, ఆస్తులను కూడా తెగనమ్మాలా? జిల్లా ప్రజల నుంచి ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదంతా జిల్లా క్రీడాశాఖలో ఓ అధికారి అవినీతి బాగోతం గురించే.

- జనరేటర్ అమ్మేసినా చర్యలు లేవు
- డిపాజిట్ సొమ్ము స్వాహా చేసినా అంతే
- ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్
- అస్తవ్యస్తంగా జిల్లా క్రీడాశాఖ





అశోక్ నగర్ డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం



జనరేటర్ మాయమైన ప్రదేశం ఇదే

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలోని రూ.12లక్షల విలువైన జనరేటర్ మాయమవడం, శాఖకు సంబంధించిన నిధులు సుమారు రూ.50లక్షల దుర్వినియోగం అయినట్లు గత నెలలో 'ఆంధ్రజ్యోతి'లో దొరికినంత దోచుకో శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనే కథనానికి అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియానికి వచ్చి, సీనియర్ కోచ్ అనిల్‌కుమార్‌తో వివరాలు ఆరా తీశారు. వాస్తవాలు తెలుసుకుని వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. అయితే నెలరోజులు గడిచినా ఎటువంటి చర్యలు లేవు. జిల్లా అధికారి మిగిలిన ఇండోర్‌స్టేడియాన్ని కూడా ఇతరులకు అమ్మేస్తే తప్ప ప్రభుత్వం, అధికారుల నుంచి చలనం ఉండదా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.



డీఎస్‌ఏ స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి (ఫైల్)

ఎమ్మెల్యే హడావుడి ఉత్తదేనా..?

గత నెలలో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన దొరికినంత దోచెయ్ కథనానికి స్పందించిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హడావుడిగా అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియానికి వచ్చారు. జనరేటర్, స్పోర్ట్స్ సామగ్రి మాయం, నిధుల దుర్వినియోగంపై ఆరా తీశారు. శాప్ సీనియర్ కోచ్ అనిల్‌కుమార్‌తో పాటు ఇతర కోచ్‌ల ద్వారా ఇండోర్‌స్టేడియం, జిల్లా క్రీడాశాఖలో జరుగుతున్న పరిణామాలపై అడిగి తెలుసుకున్నారు. జనరేటర్, స్పోర్ట్స్ మెటీరియల్ మాయంపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయించి డీఎస్‌డీఓపై క్రిమినల్ కేసు నమోదు చేయించాలని కోచ్‌లకు ఎమ్మెల్యే సూచించారు. డీఎస్‌డీఓ వ్యవహారాన్ని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి, శాప్ చైర్మన్‌ల దృష్టికి తీసుకెళ్లి శాఖాపరమైన చర్యలు తీసుకునేలా చూస్తానని కోచ్‌లు, క్రీడాకారులకు హామీ ఇచ్చారు. క్రీడలు, క్రీడాకారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అయితే అవేవీ ఆచరణ సాధ్యం కాలేదు.

అస్తవ్యస్తంగా మారిన క్రీడాశాఖ

గడిచిన ఐదేళ్లలో క్రీడాశాఖను పూర్తిగా భ్రష్టు పట్టించారు. కోచ్‌లు, ఆఫీస్ సిబ్బందిని నియంత్రించి, మెరుగైన ఫలితాలు సాధించే సారథులే కరువ య్యారు. నాలుగున్నరేళ్ల పాటు కాలయాపన చేసిన వైసీపీ ప్రభుత్వం చివరి దశలో ఆడుదాం ఆంధ్రా అంటూ ఓ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో నిధులు దుర్వినియోగం భారీగా జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాకు సుమారు 24మంది కోచ్‌లు, ఆరుగురు కార్యాలయ సిబ్బంది అవసరం కాగా సగం మంది కూడా ప్రస్తుతం పనిచేయడం లేదు. సగానికి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో అరకొరగా ఉన్న కోచ్‌లు, సిబ్బంది పనిఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేసి, స్టేడియంలో మౌలిక వసతులు కల్పిస్తారని క్రీడాకారులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫ్లడ్‌లైట్లు వెలగడం లేదు: అనిల్‌కుమార్, శాప్ కోచ్



ఇండోర్ స్టేడియంలో ఫ్లడ్‌లైట్లు వెలగడం లేదు. దీంతో కబడ్డీ ప్రాక్టీస్ ను ఎస్ఎస్‌బీఎన్ కాలేజీ మైదానంలో చేయిస్తున్నాం. స్టేడియం లోపల షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు మీదకు వర్షం నీళ్ల లీకేజీ అవుతున్నాయి. దీంతో క్రీడాకారులు సాధనకు చాలా ఇబ్బంది పడుతున్నారు. స్టేడియం లోపల వసతులు మెరుగుపరిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

జనరేటర్ అమ్మేశా: షేక్ షఫీ, డీఎస్‌డీఓ



జనరేటర్ రిపేరీకి ఇచ్చామన్న మాట అవాస్తవం. అశోక్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో ఉన్న జనరేటర్‌ను అమ్మేశాను. క్రీడాసామగ్రి కూడా పంచేశాను. వచ్చిన డబ్బులతో స్టేడియంలో కొన్ని వసతులు అభివృద్ధి చేశాను. ఇది అందరికీ తెలిసిందే. కలెక్టర్, శాప్ చైర్మన్ అడిగినా ఇదే చెప్పాను. స్టేడియం లోపల వర్షం వస్తే లీకేజీ అవుతున్న మాట వాస్తవమే. ఇక కబడ్డీ కోర్టులో ఫ్లడ్‌లైట్లు వెలగడం లేదు. స్టేడియంలో అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశాం. ప్రభుత్వం సహకరిస్తే మరింత అభివృద్ధి చేస్తాం.

వచ్చాడయ్యో సామి..!

బాధితుల వద్దకే కలెక్టర్.. సావధానంగా సమస్యల ఆలకింత

అనంతపురం టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల వేదిక వద్దకు వచ్చిన బాధితుల వద్దకే కలెక్టరు వినోద్‌కుమార్ వెళ్లి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈకార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జేసీ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్ఓ మలోల హాజరై వినతులు స్వీకరించారు. అంతకుముందు కలెక్టర్ అర్జీలు రాస్తున్న ప్రాంతానికి వెళ్లి నేరుగా బాధితులతో మాట్లాడారు. వారు చెప్పిన సమస్యలను సావధానంగా విని తప్పకుండా న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. అక్కడ దివ్యాంగులు కూర్చోవ డానికి సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతుండటాన్ని గమనించి వచ్చే సోమవారానికి కూర్చోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రెవెన్యూభవన్‌కు చేరుకొని ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 427 అర్జీలు అందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టరు వినోద్‌కుమార్ ఇతర అధికారులతో సమవే శమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంలో ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదన్నారు. సకాలంలో బాధితులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని ఆదేశించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పథకాలకు సంబంధించిన ప్రగతిలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు. బుధవారం నుంచి ఈపథకాల జీఓల ప్రకారం అమలుపై షెడ్యూల్ ఇస్తామన్నారు. విద్యార్థుల ఆపార్ అప్డేషన్, ఉచిత వంట గ్యాస్ పంపిణీ, గుంతలరోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు.



ప్రజలవద్దకే వెళ్లి వారి బాధలు వింటున్న కలెక్టరు వినోద్‌కుమార్

ప్రమథనాథా...! పాహిమాం



6



సాగునీటి ప్రాజెక్టులకు రూ.1077 కోట్లు

వ్యవసాయ పథకాలకు భారీగా కేటాయింపులు

నైపుణ్య శిక్షణకు ప్రత్యేక కేంద్రాలు

బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట

ఉమ్మడి జిల్లా రుణం తీర్చుకునేలా బడ్జెట్





సంక్షేమ బడ్జెట్..

రైతు, పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం రూపొందించిన బడ్జెట్ ఇది. ప్రజలు మెచ్చుకునేలా ఉంది. వైసీపీ ప్రభుత్వ బడ్జెట్‌లు రాష్ట్ర అభివృద్ధిని దెబ్బతీశాయి. కొన్నేళ్లు వెనక్కు నెట్టాయి. కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు ధన్యవాదాలు.

- బండారు శ్రావణి, ఎమ్మెల్యే, శింగనమల

కరువు జిల్లాపై కరుణ

చంద్రన్న అభిమానం..

ఐదేళ్ల వైసీపీ పాలనలో కరువు జిల్లా ప్రజానీకం, రైతాంగం ఎదుర్కొన్న సమస్యలను, ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిన వైనాన్ని చంద్రబాబు ప్రత్యక్షంగా చూశారు. ఇక్కడి రైతాంగం ఎదుర్కొంటున్న బాధల నుంచి విముక్తి కలిగించాలన్నదే చంద్రబాబు తపన. ప్రాజెక్టులను పూర్తి చేసి, రైతాంగాన్ని ఆదుకోవాలనే సంకల్పం ఆయనది. ఎప్పుడు జిల్లాకొచ్చినా అనంత అంటే తనకెంతో అభిమానమని చెబుతుంటారు. ఆ అభిమానాన్ని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి చాటుకున్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, ఉమ్మడి జిల్లా అభివృద్ధికి బాటలు వేసేలా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులున్నాయి.

- కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం ఎమ్మెల్యే



అనంతపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత కరువు కోరల నుంచి శాశ్వతంగా బయటపడాలంటే సాగునీరు కావాలి. ప్రతి ఎకరం తడిస్తేగానీ ఈ జిల్లా రైతాంగం సంక్షోభం నుంచి గట్టెక్కే అవకాశం లేదు. వర్షపాతంలో అసమానతల కారణంగా ఖరీఫ్, రబీ.. రెండు సీజన్‌లలోనూ పంటలు దెబ్బతింటున్నాయి. వర్షాలు లేని సమయంలో భూగర్భ జలాలను వాడుకుందామంటే.. పాతాళం వరకూ బోర్లు తవ్వించాలి. అయినా తడి కనిపించదు. ప్రాజెక్టులు పూర్తయితే.. భారీ వర్షాలు, వరదల సమయంలో వచ్చే నీటిని ఒడిసి పట్టుకోవచ్చు. ఇదే సమస్యలన్నింటికీ పరిష్కారం. కానీ సాగునీటి విషయంలో దశాబ్దాలుగా జిల్లాకు అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వాలు ఎన్ని మారినా పరిస్థితిలో మార్పు రాలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి అనంతపై చిన్నచూపు చూశారు. ఈ జిల్లా మనవడిని అంటూ హామీల వరద పారించిన జగన్.. నిధులను మాత్రం ఇవ్వలేదు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు విస్తరించేందుకు సమాంతర కాలువను తవ్విస్తానని లెస్స పలికిన జగన్.. పాలన ముగిసే సమయానికి ప్రాజెక్టు నిర్వహణకు సరిపడా నిధులను కూడా బడ్జెట్‌లో కేటాయించలేదు. హెచ్ఎల్సీ ఆధునికీకరణ అటుంచితే.. మరమ్మతులకూ నిధులు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో సాగునీటికి ప్రాధాన్యం ఇవ్వడంతో సమస్య కొంతైనా తీరుతుందని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. వీటికి కొనసాగింపుగా.. రానున్న బడ్జెట్‌లలోనూ నీటికి నిధులను పారించాలి.

లోకేశ్ చొరవ..



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం ఉమ్మడి జిల్లాలో 200 కి.మీ.పైగా యువగళం పాదయాత్ర చేశారు. జిల్లా సరిహద్దు దాటాక.. 2023 ఏప్రిల్ 14న ఉమ్మడి జిల్లా ప్రజానీకానికి బహిరంగ లేఖ రాశారు. అధికారంలోకి రాగానే అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టులకు నిధులిస్తామని, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. భైరవాన్‌తిప్ప, పేరూరు ప్రాజెక్టులకు కృష్ణా జలాల తరలింపు పథకాన్ని పూర్తి చేస్తామని ప్రకటించారు. లోకేశ్ హామీలన్నీ నెరవేర్చే దిశగా బడ్జెట్‌లో నిధులను కేటాయించారు.

చంద్రన్న కరుణ

నీరుంటే బంగారం పండిస్తారు ఉమ్మడి జిల్లా రైతులు. ఆ నీటిని ఇచ్చే దిశగా బడ్జెట్‌లో నిధులు ఇచ్చారు. జలవనరుల శాఖకు మొత్తం రూ.16,705 కోట్లు కేటాయించగా, అందులో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు రూ.1077 కోట్లు కేటాయించింది. హంద్రీనీవాకు రూ.822 కోట్లు, పేరూరు ప్రాజెక్టుకు రూ.120 కోట్లు, భైరవాన్‌తిప్పకు రూ.100 కోట్లు కేటాయించారు. హెచ్ఎల్సీ ఆధునికీకరణ ప్రస్తావన లేకపోయినా, మరమ్మతుల కోసం రూ.30 కోట్లు కేటాయించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రూ.500 కోట్లు కూడా ప్రాజెక్టులకు ఇవ్వలేదు.

అన్ని వర్గాలకూ మేలు

● బడ్జెట్‌లో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేశారు. పట్టణాభివృద్ధి, గృహనిర్మాణం, పరిశ్రమలు, వాణిజ్యం, రహదారులు, పర్యావరణం, పర్యాటకం, సాంస్కృతిక, అటవీ, యువజనుల అభివృద్ధికి భారీస్థాయిలో నిధులు కేటాయించారు. ఒక్క పట్టణాభివృద్ధికే రూ.16,705 కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. గృహ నిర్మాణానికి రూ.4 వేల కోట్లకుపైబడి నిధులు కేటాయించారు. రోడ్లు, భవనాలకు రూ.9,554 కోట్లు కేటాయించారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా నిధులు కేటాయించారు. పోలీసు శాఖకూ గణనీయంగా నిధులు ఇచ్చారు.

● ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి రూ.69 వేల కోట్లు కేటాయించారు. మహిళా, శిశు సంక్షేమానికి రూ.4,285 కోట్లు కేటాయించారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు, ఉన్నత విద్యకు ప్రోత్సహించేందుకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. ప్రజల ఆరోగ్య శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందనే సంకేతాలను బడ్జెట్ కేటాయింపుల ద్వారా పంపారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు రాష్ట్రంలో ప్రత్యేకంగా 192 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటిలో ఉమ్మడి జిల్లాకు రెండు మూడు వచ్చే అవకాశం ఉంది.

● రైతు శ్రేయస్సు దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. ఉమ్మడి జిల్లా రైతాంగానికి వ్యవసాయ బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు. అన్నదాత సుఖీభవ, పంటల బీమా, వడ్డీలేని రుణాలు, మార్కెటింగ్, విత్తనాల పంపిణీ, భూసార పరీక్షలు, ఎరువుల పంపిణీ, ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్స్, రైతు సేవా కేంద్రాలు, ఉద్యాన, సహకార శాఖల ద్వారా రైతును ఆదుకునేందుకు బడ్జెట్‌లో రూ.43,402 కోట్లను కేటాయించారు.

ప్రగతికి నాంది...



అన్నివర్గాల సంక్షేమం, ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను రూపొందించారు. రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే అత్యుత్తమ బడ్జెట్ ఇది. వైసీపీ పాలనలో ఉమ్మడి జిల్లాను విస్మరించారు. ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే సాగునీటి ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచే శిక్షణా సంస్థల ఏర్పాటుకు నారా లోకేశ్ ప్రత్యేక చొరవ చూపారు.

- బీవీ వెంకటరాముడు, టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్

నిధుల వరద పారించారు...



కూటమి అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ఉమ్మడి జిల్లాకు నిధుల వరద పారించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమష్టి కృషితో ఈ భారీ బడ్జెట్ పురుడుపోసుకుంది. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్‌ను రూపొందించారు. సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించి.. ప్రజల్లో నమ్మకాన్ని రెట్టింపు చేసుకున్నారు. భవిష్యత్తులో జిల్లాకు మరిన్ని నిధులు వస్తాయి.

- టీసీ వరుణ్, అహుడా చైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షుడు

పునర్వ్యవస్థీకరణ బడ్జెట్..



రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ, పునర్వ్యవస్థీకరణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి ఐదు దశాబ్దాలు వెనక్కి వెళ్లింది. పూర్వవైభవం తెచ్చేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసింది. ఏకంగా రూ.2,94,427.25 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఇందుకు నిదర్శనం. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలుచేసేలా నిధులు కేటాయించారు. మానవ వనరుల అభివృద్ధి, పరిశ్రమలు, విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం తదితర రంగాల పురోభివృద్ధి కొనసాగుతుంది. ప్రజారంజక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి కేశవ్‌కు అభినందనలు.

- సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

సంతృప్తికర బడ్జెట్..



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరినీ సంతృప్తి పరిచింది. అన్ని వర్గాలకూ మేలు చేసేలా నిధులు ఇచ్చారు. రైతాంగం, పరిశ్రమలు, తాగు, సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించారు. అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం ఇచ్చారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు అభినందనలు.

- భవానీ రవికుమార్, జనసేన కార్యక్రమాల నిర్వహణ కమిటీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

స్పష్టత లేదు..



జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధి కోసం రూ.7 వేల కోట్లు కేటాయించే విషయంలో స్పష్టత లేదు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ఇది ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. బడ్జెట్‌లో ఆత్మస్తుతి, పరనిందతోనే సరిపెట్టారు. పూర్తి రాజకీయ పత్రంగానే ఉంది. ఆదివాసీలు, దళితులు, మహిళలు, మైనార్టీ సంక్షేమానికి నిధులు నామమాత్రంగానే కేటాయించారు. జనాభాలో సగభాగమైన మహిళాశిశు సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు ఎప్పటి నుంచి ఉంటుందో స్పష్టత ఇవ్వలేదు. ఇది ఆయా వర్గాలను నిరాశకు గురిచేస్తోంది. బడ్జెట్‌లో సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని విస్మరించింది.

- రాంభూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి, అనంతపురం

నిధులు అరకొరే...



జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించలేదు. అరకొర నిధులతోనే సరిపెట్టారు. హంద్రీనీవాకు రూ.2 వేల కోట్లు కేటాయించి ఉంటే బాగుండేది. హెచ్ఎల్సీ ఆధునికీకరణకు నిధులు విడుదల చేయలేదు. కేవలం మరమ్మతుల కోసం కేటాయించారు. అమ్మకు వందనం, ఉచిత బస్సు, అన్నదాతా సుఖీభవ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారో బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వలేదు. గత ప్రభుత్వం వైఫల్యాలను ప్రస్తావించడంలో చూపిన శ్రద్ధ కరువు జిల్లా రైతాంగాన్ని ఆదుకోవడంపై చూపలేదు.

- జాఫర్, సీపీఐ జిల్లా కార్యదర్శి



రైతాంగానికి నిరాశ...

రాష్ట్ర బడ్జెట్ రైతాంగాన్ని నిరాశపరిచింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలు ఇచ్చింది. రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని ప్రకటించింది. బడ్జెట్‌లో రూ.14వేలు మాత్రమే ఇస్తామని ప్రకటించడం దుర్మార్గం. రాయలసీమలో పంటల పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. రైతులు అప్పుల పాలై ఆత్మహత్య చేసుకుంటున్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వమే రూ.20వేలు ఇవ్వాలి. అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్ చేస్తామని చెప్పడం తప్ప బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులను కేటాయించలేదు. విత్తనాల సబ్సిడీకి తక్కువ మొత్తంలో నిధులు కేటాయించారు. హెచ్చెల్సీ లైనింగ్, హంద్రీనీవా కాలువ వెడల్పునకు పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వలేదు.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ప్రగతి.. పునర్నిర్మాణం

బడ్జెట్‌పై మేధావివర్గాల హర్షం

అనంతపురం సెంట్రల్, నవబంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతి, పునర్నిర్మాణమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టిందని మేధావి వర్గాలు వ్యాఖ్యానించాయి. మానవ వనరుల అభివృద్ధి, యువత నైపుణ్యాల పెంపుదల, ఉన్నత విద్యావ్యవస్థ బలోపేతానికి పెద్ద పీట వేసిందని హర్షం వ్యక్తం చేశాయి. భారీ పరిశ్రమలను అకర్షించేందుకు ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందని పలువురు అన్నారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పట్ల ఆ వర్గాలు సంతోషం వ్యక్తం చేశాయి. రాష్ట్ర బడ్జెట్‌పై వివిధ రంగాల ప్రముఖుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

● ప్రణాళికాబద్ధంగా ఉంది..



ప్రతి విద్యార్థికి ఉన్నత విద్యనందించి, విజ్ఞానం, నైపుణ్యం పెంచేలా ప్రణాళికాబద్ధమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వ ముందుచూపునకు నిదర్శనం. వర్సిటీల బలోపేతానికి, జాతీయ సంస్థాగత స్థాయి చట్రం(ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకులు సాధించేందుకు, పోస్టులను భర్తీచేయడానికి చొరవ తీసుకోవడం అభినందనీయం. సేల్స్‌ఫోర్స్, ఎడ్యుస్కిల్స్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు ఒప్పందాలు కుదుర్చుకోవడం, మధ్య వేతనం అందించేలా అప్రెంటిస్‌షిప్‌తోకూడిన డిగ్రీ విద్యను అందించేలా బడ్జెట్ కేటాయింపులు ఉండటాన్ని స్వాగతిస్తున్నాం.

- ప్రొఫెసర్ సుదర్శనరావు, జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ

● స్వర్ణాంధ్ర విజన్..



స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనకు నడుంబిగించిన కూటమి ప్రభుత్వం, ఆ దిశగా బడ్జెట్‌లో నిధులను కేటాయించింది. ప్రతి కుటుంబం ఆర్థిక భారం నుంచి గట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల అమలుకు పెద్ద పీట వేసింది. పాఠశాల స్థాయినుంచి ఉన్నత విద్యవరకు బోధనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. అధ్యాపకుల నైపుణ్యం పెంచే ప్రతిపాదనలు హర్షణీయం. ఉన్నత విద్యారంగానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది.

- ప్రొఫెసర్ నారాయణరెడ్డి, జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్

● వర్సిటీల బలోపేతం..



సంప్రదాయబద్ధమైన రాష్ట్ర విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం అడుగులు వేయడం హర్షణీయం. ఖాళీ పోస్టుల భర్తీ, విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్, నైపుణ్యం రంగంలో వనరుల బలోపేతం, పరిశ్రమలతో అనుసంధానం ఇలా అనేక అంశాలు బడ్జెట్‌లో ఉన్నాయి. ఇవన్నీ వర్సిటీలకు పూర్వవైభాన్ని తెస్తాయి.

- డాక్టర్ రమేష్‌బాబు, ఎస్కేయూ రిజిస్ట్రార్

●న్యాయవిద్యకు ప్రాధాన్యం ఇవ్వాల్సింది..



రాష్ట్ర ప్రగతి, పునర్నిర్మాణమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. మానవ వనరుల అభివృద్ధి, యువత నైపుణ్యాల పెంపుదల, ఉన్నత విద్యావ్యవస్థ బలోపేతానికి పెద్ద పీట వేసింది. అయితే న్యాయ వ్యవస్థకు పునాదుల్లాంటి న్యాయ విద్యార్థులకు శిక్షణ, భృతి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలలో న్యాయ విద్య కోర్సులను ప్రవేశపెట్టి, సరిపడా అధ్యాపకులను నియమించేందుకు కృషిచేయాలి. లేదంటే ప్రైవేట్ లా కాలేజీలపైనే పేద విద్యార్థులు ఆధారపడాల్సి వస్తుంది.

- లాయర్ నారాయణప్ప, బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

● ఉచిత విద్యుత్‌పై స్పష్టత లేదు..



చేనేతలకు ఉచిత విద్యుత్ ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు స్పష్టమైన హామీనిచ్చాయి. బడ్జెట్‌లో మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఉచితం లేదా రాయితీ అని పేర్కొనడం చేనేతలకు నిరాశ కలిగిస్తోంది. అన్ని రంగాల అభివృద్ధికి చూపుతున్నట్లుగానే చేనేత రంగంపై చొరవ చూపాలి. రాయలసీమలో మగ్గంపై ఆధారపడి జీవిస్తున్న చేనేత కుటుంబాలు చాలా ఉన్నాయి. వారి కళాప్రతిభతో రాష్ట్ర ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటుతున్నారు. వచ్చే బడ్జెట్‌లోనైనా చేనేతలకు తగిన నిధులు కేటాయించాలి.

- రుషింగప్ప, జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు

● శుభపరిణామం..



ఉన్నత విద్యాశాఖను బలోపేతం చేసేలా బడ్జెట్‌లో రూ.2,326 కోట్లను కేటాయించడం శుభపరిణామం. వర్సిటీల పురోగతిపై మరింత దృష్టి సారించాల్సి ఉంది. మౌలిక సదుపాయాల కల్పన, ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, రీసర్చ్, ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. అప్పుడే మానవ వనరుల అభివృద్ధి సాధ్యమౌతుంది. ప్రవేశాల ప్రక్రియను డిజటలైజేషన్ చేసేలా వర్సిటీలకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేయాలి. దీనికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

- అరుణ్ కుమార్, పరిశోధక విద్యార్థి, ఎస్కేయూ

● లక్షల మందికి ఉపాధి...



విద్యతోపాటు నైపుణ్యాలను పెంపొందించి లక్షలాది మంది విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 192 నైపుణ్య కేంద్రాలు, నైపుణ్య కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చొరవచూపారు. నైపుణ్యాభివృద్ధి శాఖకు రూ.1215 కోట్లను కేటాయించడం హర్షణీయం. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగంచేసుకోవాలి.

- వెంకటరెడ్డి, స్కిల్‌డెవలప్‌మెంట్ జిల్లా అధికారి

● వందశాతం ఖర్చుచేయాలి..



ఎస్సీలకు రూ.18,497 కోట్లు, ఎస్టీలకు రూ.7,557 కోట్లు, బీసీలకు రూ.39,007 కోట్లు, మైనార్టీలకు రూ.4,376 కోట్ల నిధులను కాంపొనెంట్ పేరుతో బడ్జెట్‌లో కేటాయించడం అభినందనీయం. ఆ నిధులను వందశాతం ఖర్చు చేయాలి. గత ఐదేళ్లుగా కార్పొరేషన్‌లు నిర్వీర్యం అయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాల ప్రజలు ఆర్థికంగా వెనకబడిపోయారు. అర్హత, నైపుణం ఉన్నా ప్రభుత్వ సహకారం లేకపోవడంతో నిరుపేదలుగానే మిగిలిపోయారు.

- సాకే హరి, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

సుక్కేద్దామంటే సిక్కలేదే..?



చెట్టు మీద మద్యం బాటిల్‌తో కుస్తీ పడుతున్న వానరం

శింగనమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తేరగా సిక్కింది కదా ఓ సుక్కేద్దామనుకుందేమో..! గబుక్కున బండి బ్యాగులోని క్వార్టర్ బాటిల్ తీసుకుని చెట్టెక్కింది. దాని మూత తీసే టెక్నిక్ తెలియక చాలా సేపు కష్టపడింది. ఎంతసేపటికీ మూత రాకపోవడంతో... ఎందుకులే అని కిందకు విసిరేసింది. ఇవీ శింగనమల తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం మద్యం బాటిల్ మర్కట చేష్టలు. తహసీల్దార్ కార్యాలయంలో పని మీద ఓ వ్యక్తి ద్విచక్రవాహనంలో వచ్చాడు. అతడు కార్యాలయంలోని వెళ్లగానే అక్కడే ఉన్న ఓ వానరం తినడానిక ఏమైనా దొరుకుతాయేమోనని ద్విచక్రవాహనం వద్దకు వచ్చింది. బైక్ బ్యాగులో మద్యం బాటిల్ ఉండటంతో ఏదో తాగేదనుకుని దాన్ని తీసుకుని చెట్టు మీదికి వెళ్లింది. అరగంటపాటు అవస్థలు పడిన బాటిల్ మూత రాకపోవడంతో దాన్ని కిందకు జారవిడిచి, ఉసూరుమంటూ అక్కడి నుంచి వెళ్లిపోయింది.

ప్రమథనాథా...! పాహిమాం

శైవాలయాలకు కార్తీకశోభ



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కాశీవిశ్వేశ్వరస్వామి





కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఉన్న శివాలయాలన్నీ కార్తీకశోభతో దేదీప్యమానంగా వెలుగొందాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు హర నామ స్మరణ చేస్తూ దేవాలయాల్లో దీపాలు వెలిగించి నీలకంఠుడిని ఆరాధించారు. జిల్లాకేంద్రంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, బెంగళూరు రోడ్డులోని శివకోటి దేవాలయం, పాతూరు విరూపాక్షేశ్వరాలయం, జడ్పీ ఎదురుగా ఉన్న గీతామందిరం, హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ స్వామి దేవాలయం, చాముండేశ్వరి దేవాలయం, ఆరోరోడ్డు శివాలయం, అరవిందనగర్ సర్వేశ్వరాలయం, హౌసింగ్ బోర్డు శివాలయం తదితర ప్రాంతాల్లోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.



వచ్చే నెలే డెడ్‌లైన్

డిసెంబరుకు ఎన్‌హెచ్ పనులు పూర్తి కావాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపడుతున్న జాతీయరహదారుల పనులు డిసెంబరు నెలాఖరులోగా పూర్తి కావాలని సంబంధిత అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. రోడ్డు పనుల ప్రగతిపై సోమవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌హెచ్-544డి, ఎన్‌హెచ్-67, ఎన్‌హెచ్ -544డీడీ, ఎన్‌హెచ్-150ఏ జాతీయరహదారులకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలన్నారు. ఎట్టిపరిస్థితులలోను డిసెంబరుకు పనులు పూర్తి కావాలన్నారు. జాతీయ రహదారులతో పాటు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, పవర్‌గ్రిడ్‌టవర్స్, ఏపీట్రాన్స్‌కో, జెన్కో, ఏపీ సోలార్ కార్పొరేషన్, రైల్వేస్ తదితర ప్రాజెక్ట్‌లకు సంబంధించిన భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు ఎక్కడెక్కడ ఎంత భూసేకరణ చేపట్టారో వాటి నివేదికలను ఇచ్చి, మిగిలిన భూసేకరణ కొనసాగించాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే తనతో పాటు జేసీ, డీఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలని కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్‌ఓ మలోల, ఎన్‌హెచ్ అధికారులు, పవర్‌గ్రిడ్ అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.



జాతీయ రహదారుల పనులపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టరు వినోద్ కుమార్

డీఎస్పీ కార్యాలయం వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తనకు న్యాయం చేయాలంటూ ఓ మహిళ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన డీఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... పట్టణానికి చెందిన ఓ మహిళను కంబదూరు మండలానికి చెందిన ఉపాధ్యాయుడు కొన్ని నెలల కిందట వివాహం చేసుకున్నాడు. ఈక్రమంలోనే ఆమె గర్భం దాల్చింది. అయితే ఆ ఉపాధ్యాయుడు అబార్షన్ చేయించి, తనను దూరం పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడంటూ ఆ మహిళ కొన్ని రోజుల కిందట ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. పరిశీలించాలని ఎస్పీ కార్యాలయం నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఆ ఫిర్యాదును పంపారు. ఈక్రమంలోనే డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్న ఆ మహిళ ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా తనకు ఎలాంటి న్యాయం జరగడం లేదని పేర్కొంటూ, తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన పోలీసులు వెంటనే పెట్రోల్ బాటిల్‌ను లాక్కుని ఆమె యత్నాన్ని అడ్డుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తత్కాల్‌లో దళారుల దందా..!

- అనంత రైల్వే స్టేషన్‌లో ఇష్టారాజ్యం
- గంటల తరబడి పడిగాపులు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం రైల్వే స్టేషన్‌లో తత్కాల్ టికెట్ల జారీలో దళారుల దందాతో అసలైన ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. దీనికి తోడు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎవరు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో అర్థం కాని పరిస్థితి. రిజర్వేషన్ కోసం నాలుగు కౌంటర్లు వినియోగించేలా భవనం అందుబాటులో ఉంది. నిర్వహణ మాత్రం అందుకు విరుద్ధంగా అమలవుతోంది. గతంలో ఉన్న పాత రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల వరకు రెండు కౌంటర్లు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం సౌకర్యాలు పెంచారు. ప్రయాణికుల రద్దీ పెరిగినా రిజర్వేషన్ కౌంటర్ మాత్రం ఒక్కటే అందుబాటులో ఉంటోంది. తత్కాల్ సమయంలో కూడా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా యంత్రాంగం చర్యలు చేపట్టలేదు. పేరుకు మాత్రం తత్కాల్ సమయంలో ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమిస్తున్నామని చెప్పుకొస్తున్నారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కనీసం రెండు గంటలు కూడా రెండు కౌంటర్లు తీయలేని దుస్థితి నెలకొంది. రిజర్వేషన్‌కు ఒక్క కౌంటర్ మాత్రమే అందుబాటులో ఉంది. ప్రయాణికులు తత్కాల్ టికెట్ కోసం తమ వరకు వస్తుందో లేదో అని బిక్కు బిక్కుమంటూ లైన్‌లో నిలబడుతున్నారు. లైన్‌లో ఉన్నా ప్రయాణికుల క్యూ మాత్రం ముందుకు కదలడం లేదు. ముందు రోజు రాత్రి నుంచి దళారులు క్యూలైన్‌లో ఫామ్స్ పెట్టి తమ పని కానిచ్చుకూంటూ రాకెట్‌ను నిర్వహిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. అందుకు ప్రధాన సాక్ష్యంగా తత్కాల్ టికెట్ కోసం లైన్‌లో నిలబడిన వారికి ఎవరికీ దొరకక పోవడమేనని తెలుస్తోంది. రెండుమూడు సార్లు స్టేషన్‌లో తత్కాల్ టికెట్ కోసం వచ్చి వెనుతిరిగిన వారు తిరిగి స్టేషన్ వైపు రారని ప్రచారం జరుగుతోంది. ఏ ఆన్‌లైన్ సెంటర్‌లోనో దళారులను సంప్రదించి రెండింతలు సొమ్ము చెల్లించి టికెట్స్ పొందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ నెలకొన్న అస్తవ్యస్తమైన నిర్వహణతో సమీపంలోని రైల్వేస్టేషన్లలో ఉన్న కౌంటర్లకు వెళ్లడమా? లేదా ఆన్‌లైన్ సెంటర్ల వద్ద దళారులను సంప్రదించడమా అన్నది రోజు రోజుకు పెరిగిపోతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తత్కాల్ సమయంలోనైనా రద్దీకి అనుగుణంగా కౌంటర్లు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


ఒక కౌంటరే ఉపయోగంలో ఉన్న దృశ్యం

లైన్‌లో నిలబడినా టికెట్ కష్టమే



అనంతపురం నుంచి బెంగళూరు వెళ్లడానికి తత్కాల్ టికెట్ తీసుకోవడం కోసం రైల్వే స్టేషన్‌లోని కౌంటర్‌కు వచ్చాను. తత్కాల్ సమయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిసి గంట ముందుగానే వచ్చి లైన్‌లో నిలబడి ఉన్నా. అసలు లైన్ మాత్రం ముందుకు కదలడం లేదు. సమయం అయిపోయింది. టికెట్ మాత్రం రాలేదు. ఇక్కడ పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. -సుధ, ప్రయాణికురాలు

రెండు గంటలు ముందుగా వచ్చాం



విజయవాడ నుంచి అనంతపురం రావడానికి తత్కాల్ టికెట్ తీసుకోవడం కోసం రెండు గంటలు ముందుగా లైన్‌లో వచ్చి నిలబడినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఇక్కడ జరుగుతున్న దందా ఏమిటన్నది అర్థం కానిపరిస్థితి. ఇంత రద్దీ ఉన్నప్పటికీ ఒకే కౌంటర్ నిర్వహణ ఉండడం దారుణం. అధికారులు స్పందించి ప్రయాణికుల సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైన ఉంది. - రామకృష్ణ, ప్రయాణికుడు

లైన్‌లో నిలబడి నీరసించాల్సిందే



అనంతపురం నుంచి అత్యవసర పనిమీద హైదరాబాద్ వెళ్లాల్సి ఉండడంతో తత్కాల్ టికెట్ కోసం వచ్చాం. లైన్‌లో నిలబడి నిరసించాల్సిందే తప్పా. టికెట్ మాత్రం దొరకలేదు. ఇక్కడి పరిస్థితులపై ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలి.

- జగన్నాథ్, ప్రయాణికుడు

స్పోర్ట్స్ కార్నర్

బ్యాడ్మింటన్‌లో యాడికి యువకుడికి గోల్డ్‌మెడల్


గోల్డ్‌మెడల్ సాధించిన విజయ్.. ట్రోఫీతో..

యాడికి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో యాడికి యువకుడు విజయ్ బంగారు పతకం సాధించాడు. మణిపూర్ రాష్ట్రంలోని ఇంఫాల్‌లో ఆదివారం నిర్వహించిన ఈస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో విజయ్ ప్రతిభను కనబరిచి మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో డిసెంబరులో జైపూర్‌లో నిర్వహించనున్న ఆల్‌ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌కు ఎంపికయ్యాడు.

ఓపెన్ చెస్ టోర్నీ విజేత రామారావు


రామరావుకు ట్రోఫీని అందజేస్తున్న టోర్నీ నిర్వాహకులు

గుంతకల్లుటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో ఆదివారం స్పార్క్ చెస్ అకాడమీ, సాయిజ్యోతి నేత్రదాన ఐ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్ విజేతగా పట్టణానికి చెందిన రామారావు నిలిచాడు. ఈ పోటీల్లో పలు జిల్లాల నుంచి 120 మంది పాల్గొన్నారు. రామారావు 6/6పాయింట్లతో ట్రోఫీ, నగదు బహుమతిని అందుకున్నాడు. మూడో స్థానంలో రోటరీ పాఠశాల విద్యార్థి వంకదారు సాయిప్రణీష్ 5.50/6పాయింట్‌లతో ట్రోఫీ, నగదు పురస్కారాన్ని అందుకున్నాడు. అలాగే 9, 14, 15,18 స్థానాల్లో వేద్‌వందిత్, జునైలా నిజాం, ఉదయ్‌కిరణ్, స్నేహిత్ అనే విద్యార్థులు నిలిచారు. అండర్-7 విభాగంలో దేవేశ్వర్ 4/6పాయింట్లతో గోల్డ్‌మెడల్ సాధించాడు. అండర్-9 విభాగంలో కార్తీక్4/6గోల్డ్‌మెడల్ సాధించాడు.

సెపక్‌తక్రా జాతీయ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినితో కరస్పాండెంట్

ఉరవకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహేశ్వరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థిని తేజ జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైంది. కర్నూలు జిల్లా సి బెళగల్‌లో ఎస్‌జీఎఫ్ అండర్-17 సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా జట్టు తరపున ఆ పాఠశాల నుంచి తేజ, మోసెస్ అనే విద్యార్థులు పాల్గొన్నారు. డిసెంబరు 26 నుంచి మణిపూర్ రాష్ట్రంలోని ఇంఫాల్‌లో జరిగే పోటీల్లో తేజ పాల్గొంటుందని కరస్పాండెంట్ సునంద, పీఈటీ ఎర్రిస్వామి సోమవారం తెలిపారు.

ఆంధ్రా జట్టులోకి ఇద్దరు జిల్లావాసులు


వినయ్‌కుమార్


గిరినాథ్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ జట్టులో జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులకు చోటు దక్కింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీనియర్ టీ 20, వన్డే జట్టు 2024-25 సీజన్‌కు జిల్లాకు చెందిన వినయ్‌కుమార్, గిరినాథ్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈనెల 25 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించే సయ్యద్‌ముస్తాక్ అలీ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రా జట్టు తరఫున వీరు పాల్గొననున్నారు. డిసెంబరు 21 నుంచి ముంబైలో జరిగే విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్రా జట్టు తరఫున పాల్గొంటారన్నారు. వీరిని జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి అభినందించారు.

జాతీయ హాకీ పోటీలకు కుంటిమద్ది విద్యార్థి


వినయ్‌కుమార్

రామగిరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి హాకీ పోటీలకు కుంటిమద్ది ఉన్నత పాఠశాలకు చెందిన జి.సాత్విక్ ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం అనంత పద్మనాభులు, పీడీ నాగేశ్‌బాబు తెలిపారు. పాఠశాలలో సోమవారం ఆ విద్యార్థికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 8,9,10 తేదీల్లో అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలలో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబరులో మధ్య ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో ఈ విద్యార్థి పాల్గొంటారన్నారు.

16, 17 తేదీల్లో క్రీడా ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఉమ్మడి జిల్లా క్రీడా ఎంపిక పోటీలు ఈనెల 16, 17తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్-19 కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. 16న నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో క్రికెట్ పోటీలు ఉంటాయన్నారు. 17న వాలీబాల్, బీచ్ వాలీబాల్ పోటీలు ప్రభుత్వ బాలుర, న్యూటౌన్ జూనియర్ కళాశాల మైదానం లో నిర్వహిస్తారన్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ రెండో సంవత్సరం చదువుతూ 2006 జనవరి 1 తరువాత జన్మించిన క్రీడాకారులు పోటీలకు అర్హులన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, పదోతరగతి మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్ నంబరు 9441284618ను సంప్రదించాలని కోరారు.

19న జిల్లాస్థాయి యువ ఉత్సవ్


పోస్టర్లు విడుదల చేస్తున్న జేసీ, ఇతర అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఈనెల 19న జేఎన్‌టీయూలో నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా ప్రోగ్రాం అధికారి గోవర్ధన్ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జేసీ శివనారాయణ శర్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌లో జిల్లా వ్యాప్తంగా ఉన్న యువతీ, యువకులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువతకు సైన్సుమేళా, యంగ్ రైటర్స్ కాంటెస్ట్, యంగ్ ఆర్టిస్ట్ కాంటెస్ట్, ఫొటోగ్రఫీ, వర్క్‌షాప్, డిక్లమేషన్, జిల్లా గ్రూప్ కల్చరల్ ఫెస్టివల్ పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి అందజేయడంతో పాటు వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్‌ఓ మలోల, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జీవన్ కుమార్, జయమారుతి తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా రుణమేళా

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో బుధవారం మెగా బ్యాంకు రుణమేళా నిర్వహించనున్నట్లు ఎల్‌డీఎం నర్సింగరావు తెలిపారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమంలో అన్ని బ్యాంకుల అధికారులు, డీఐసీ, చేనేత, ఉద్యాన శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌డీఎం కోరారు.

అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి


జ్యోతి (ఫైల్)

గోరంట్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్ కాలనీకి చెందిన మూడు నెలల గర్భిణి జ్యోతి (23) అనుమానాస్పద స్థితిలో ఆదివారం రాత్రి మృతిచెందింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాకు చెందిన జ్యోతి.. దీపక్ అనే వ్యక్తితో గోరంట్లలోని రాజీవ్‌కాలనీలో ఆరునెలలుగా సహజీవనం సాగిస్తోంది. మూడు నెలల గర్భిణి ఆమె ఆదివారం అస్వస్థతకు లోనుకావడంతో అద్దె ఇంటి యజమాని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి బంధువు విస్వాస్ సహకారంతో ప్రైవేటు వాహనంలో హిందూపురం ఆస్పత్రికి తరలించారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో వైద్యులకు అనుమానం వచ్చి, పోలీసులకు సమాచారం అందించారు. కోల్‌కతాలోని జ్యోతి బంధువులకు పోలీసులకు సమాచారం ఇచ్చి, దర్యాప్తు చేస్తున్నారు.

పురం మున్సిపాలిటీకి తాత్కాలిక చైర్మన్


బలరామిరెడ్డి

హిందూపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పురం మున్సిపాలిటీ తాత్కాలిక చైర్మన్‌గా బలరామిరెడ్డిని నియమిస్తూ పురపాలకశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. చైర్‌పర్సన్‌గా ఉన్న ఇంద్రజ రెండు నెలల క్రితం పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి చైర్మన్ స్థానం ఖాళీగా ఉంది. కొత్త చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ రాలేదు. వరుసగా మూడు నెలలు కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోతే రద్దయ్యే అవకాశం ఉంటుంది. దీంతో పురపాలకశాఖ 14వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా, మున్సిపల్ రెండో వైస్ చైర్మన్‌గా ఉన్న బలరామిరెడ్డిని తాత్కాలిక(డెలిగెట్) చైర్మన్‌గా నియమిస్తూ పురపాలకశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త చైర్మన్ నోటిఫికేషన్ వచ్చేవరకు ఆయనే చైర్మన్‌గా కొనసాగనున్నారు.

గాలి, వెలుతురు లేకనే.. వరికి సుడిదోమ

శాస్త్రవేత్త రామసుబ్బయ్య


వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

పెనుకొండ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వరిపైరుకు గాలి, వెలుతురు అందకనే సుడిదోమ ఆశిస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్త రామసుబ్బయ్య పేర్కొన్నారు. మండలంలోని వెంకటగిరిపాళ్యం చెరువు ఆయకట్టులో దెబ్బతిన్న వరిపంటను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. సుడిదోమ ఆశించడం వల్ల వరిపంట దెబ్బతిందన్నారు. పొలంలో ప్రతి రైతు రెండు మీటర్ల వరి నాట్లకు కాలిబాటలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బీపీటీ వరి రకానికి సుడిదోమ ఎక్కువగా ఆశిస్తుందన్నారు. ఎండుదశలో ఉన్న పంటలకు మొదలు వరకు కాలిబాట ఏర్పాటుచేసి, పినాకులస్ ట్రూపస్, ట్రైమటోజెన్ మందులను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ చందన, రైతులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీగా వరలక్ష్మి



పుట్టపర్తిరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జ్ ఐసీడీఎస్ పీడీగా వరలక్ష్మి సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో వరలక్ష్మి ఓడీసీ సీడీపీఓగా విధులు నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ (ఎఫ్ఏసీ)గా విధులు నిర్వహిస్తున్న నాగమల్లేశ్వరి సెలవుపై వెళ్లడంతో వరలక్ష్మిని ఇన్‌చార్జ్‌గా నియమించారు.

శ్రీకృష్ణపై దాడి చేసిన మూకలపై చర్యలు తీసుకోండి

- ఎస్పీకి బెస్త సేవా సంఘం నాయకుల వినతి


ఎస్పీకి వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న బెస్త సేవా సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు ముందు సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని బెస్త సేవా సంఘం నాయకులు జిల్లా ఎస్పీ జగదీష్‌ను కోరారు. ఈమేరకు డీపీఓలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందించారు. అప్పుడు దాడికి పాల్పడినవారిలో ఒకరిని మాత్రమే రిమాండ్‌కు తరలించారన్నారు. మిగిలిన ఏ ఒక్కరినీ పోలీసులు అరెస్టు చేయలేదన్నారు. వైసీపీ నాయకుల ఒత్తిడితోనే దాడికి పాల్పడిన మూకలను పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని ఆరోపించా రు. ఇప్పటికైనా శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయడంతోపాటు, వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి శిక్షించాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మూకలపై రౌడీ షీట్ ఓపెన్ చేసి, జిల్లా నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రబాబు, ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి నాగేంద్ర, నగర ప్రధాన కార్యదర్శి చేపల హరి, నాయకులు నాగరాజు, వెంకీ ఎస్పీకి వినతి పత్రం సమర్పించారు.

ఎస్సీ వెల్ఫేర్ డీడీ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్(డీడీ)గా ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా కుడాలో డెప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఆయనను రాష్ట్ర శాఖ అధికారులు అనంత జిల్లా ఎస్సీ వెల్ఫేర్ డీడీగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సూపరింటెండెంట్లు రవికాంత్, వెంకటలక్ష్మి, ఎన్‌జీపీసీ సూపరింటెండెంట్లు అన్వర్‌బాషా, గోవిందమ్మ, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆ శాఖ ఏఎస్‌డబ్ల్యూఓలు, వార్డెన్లు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డీడీని కలిసి వారిలో ఏఎస్‌డబ్ల్యూఓలు దామోదర్‌రెడ్డి, రాధిక, రామ్మోహన్, వార్డెన్లు రామునాయక్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, వసంత, అనిత, సునీత, ప్రసన్న తదితరులు ఉన్నారు.

రేపు జాబ్‌మేళా

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం రామ్‌నగర్‌లోని నలంద డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. యాక్సిస్‌బ్యాంకు, సీఎస్‌ఆర్ అసోసి యేట్స్, జారికార్ట్ కంపెనీలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ ఆపైన చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబరు 83175 20929ను సంప్రదించాలని కోరారు.

క్రైం కార్నర్..

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


కేతిరెడ్డి నరసింహారెడ్డి (ఫైల్)

ముదిగుబ్బ, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొరిగిల్లు గ్రామానికి చెందిన కేతిరెడ్డి నరసింహారెడ్డి(38) సోమవారం విద్యుదాఘాతంతో మరణించాడు. జమేదార్ ఇస్మాయిల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరసింహారెడ్డి వ్యవసాయంతోపాటు మోటారు మెకానిక్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. తన గ్రామానికే చెందిన రైతు రామాంజనేయులు పొలంలో విద్యుత్ మోటారుకు మరమ్మతులు చేసేందుకెళ్లాడు. స్టార్టర్ పెట్టెలో వైర్లు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌వైరు చేతికి తగిలి, అపస్మారక స్థితిలో పడిపోయాడు. రైతు రామాంజనేయులు.. నరసింహారెడ్డి కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా తెలిపాడు. నరసింహారెడ్డి భార్య మౌనిక, బంధువులు పొలం వద్దకెళ్లి ప్రైవేటు వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నరసింహారెడ్డికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత...


చిరుత కళేబరం

మడకశిర, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద మధుగిరి ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృతిచెందింది. రోడ్డు పక్కనే చిరుత కళేబరాన్ని సోమవారం గుర్తించారు. రహదారి పక్కనే చిరుత కళేబరాన్ని చూసి అటుగా వెళ్లినవారు అటవీ అధికారులకు సమాచారం అందించారు. జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) చక్రపాణి, సబ్ డీఎఫ్ఓ ఆనంద్, రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని, చిరుత మృతికి కారణాలపై ఆరా తీశారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృతిచెందినట్లు భావిస్తున్నామని డీఎఫ్ఓ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక మేరకు విచారణ చేపడతామన్నారు.

రైతుపై దాడిచేసిన ఎలుగుబంటి...


ఎలుగుబంటి కళేబరం

మడకశిర, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలం బాజయ్యపాళ్యం గ్రామానికి చెందిన రైతు నాగరాజుపై సోమవారం ఎలుగుబంటి దాడి చేసింది. ఆ ఎలుగుబంటి కూడా మరణించింది. నాగరాజు పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా ఎలుగుబంటి దాడి చేసి, గాయపరచింది. అక్కడే ఎలుగుబంటి కూడా మృతిచెందింది. సమాచారం అందుకున్న డీఎఫ్ఓ చక్రపాణి ఘటనాస్థలానికి చేరుకుని ఎలుగుబంటి కళేబరాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నివేదికలో ఎలుగుబంటి మృతికి కారణాలు తెలుస్తాయనీ, ఆ మేరకు దర్యాప్తు చేస్తామని డీఎఫ్ఓ వెల్లడించారు. ఎలుగుబంటి దాడిలో గాయపడిన నాగరాజుకు చికిత్స చేయిస్తున్నామన్నారు.

సంక్షిప్తం

కార్తీక సోమవారం పూజలు



అలంకరణలో దోనరామేశ్వర స్వామి

శింగనమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక మాస రెండో సోమవారం సందర్భంగా మండలంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నజలాలపురం దోనరామేశ్వరా స్వామి, శింగనమల ఆత్మ సీతరాముల దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సాయంత్రం దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు గో, వృషభ కల్యాణం

అనంతపురం కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పశువులు, పాడిపంటల వృద్ధిని కాంక్షిస్తూ సాయి ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం గోమాత వృషభరాజ కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. జిల్లాకేంద్రంలో హెచ్చెల్సీ కాలనీలో ఉన్న వలీస్వామి ఆశ్రమంలో నిర్వహిస్తున్నట్లు సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు పాండురంగ పాద స్పర్శదర్శనం

అనంతపురం కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాస శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో నిజపాద స్పర్శదర్శనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు భావసార క్షత్రియ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు తిరుపతిరావు, ఆనంద్ సోమవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు విరివిగా తరలిరావాలని వారు కోరారు.

18న వ్యక్తిగత అర్జీల కార్యక్రమం

నార్పల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆధ్వర్యంలో ఈ 18వ తేదీన నిర్వహించే వ్యక్తిగత అర్జీల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పెద్దయ్య, సీపీఐ మండల కార్యదర్శి సాకే గంగాధర కోరారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయం వద్ద ఆర్జీల కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి చాపల రామాంజి, సీనియర్ నాయకులు నాగరాజు, సుధాకర్, నారాయణప్ప, గూగూడు యంగపప, శీనా, రఫీ పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠకు రండి

చెన్నేకొత్తపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లిలో బుధవారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు వాల్మీకి కులస్థులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్ఠలో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సీతారాముల కల్యాణం నిర్వహిస్తామన్నారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. వాల్మీకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

బైకు ఢీ కొని వృద్ధుడి మృతి

అనంతపురం క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం ఢీ కొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. నగర శివారులోని రాచానపల్లికి చెందిన సుబ్బరాయుడు(78) సిండికేట్‌నగర్ సమీపంలో సోమవారం ఉదయం రోడ్డు దాటుతుండగా ఓ ద్విచక్రవాహనం ఢీ కొంది. దీంతో తీవ్ర గాయాలకు గురైన ఆ వృద్ధుడు మృతి చెందాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

గార్లదిన్నె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో సోమవారం మెహరున్నీ (63) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. యర్రగుంట్లకు చెందిన జాఫర్‌సాబ్, మెహరున్నీ దంపతులు కూలీపనులు చేసుకుని జీవనం సాగించేవా రు. మెహరున్నీ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేది. సోమవారం కడుపు నొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావకం తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. ఇంటికి వచ్చిన భర్త, కుటుంబ సభ్యులు గమనించి అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కనగానపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. మండలంలోని దాదులూరులో బెల్టు షాపులో నిల్వ ఉంచిన 16 మద్యం బాటిళ్లను పట్టుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ ఎస్‌ఐలు అలీబేగ్, ఫరూక్ ఆజం తెలిపారు. మద్యాన్ని విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి, మద్యం బాటిళ్లను సీజ్ చేశామన్నారు.

ఐదుగురిపై కేసు

గార్లదిన్నె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కనుంపల్లిలో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కనుంపల్లిలో వీరాంజినేయులు, నాగేంద్రకు, రామాంజినేయులు, నాగరాజు, నాగభూషణకు పొలం వద్ద వారం రోజుల క్రితం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు సోమవారం ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


ఆర్డీటీ భవనంలో ప్రభుత్వ పాఠశాల

- ఒకే గదిలో ఐదు తరగతులు
- శిథిలావస్థలో పాఠశాల భవనం



ఒకే గదిలో చదువుకుంటున్న ఐదు తరగతుల విద్యార్థులు

గార్లదిన్నె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చి దిద్దామని ఉపన్యాసాలు హోరెత్తించింది. నాడు-నేడుతో విద్యార్థులకు అన్ని సౌకర్యాల నడుమ నాణ్యమైన విద్యను అందిస్తున్నామని గొప్పలు చెప్పింది. వైసీపీ ప్రభుత్వం నాటి మాటలు నీటి మూటలేనని అనడానికి మండలంలోని కల్లూరు అగ్రహారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నిదర్శనంగా నిలుస్తోంది. కల్లూరు అగ్రహారంలోని ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 50 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో ఇద్దరు టీచర్లు



పెచ్చులూడిన ప్రభుత్వ పాఠశాల పైకప్పు

విద్యను బోధిస్తున్నారు. అయితే పాఠశాల పై భాగం పూర్తిగా పెచ్చుటూడి శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థులు భయం గుప్పిట్లో విద్యను కొనసాంచేవారు. అయినా నాడు-నేడు ఫేస్-1 , ఫేస్-2లో సైతం ఈ పాఠశాల మరమ్మతులు చేపట్టకపోవడం విడ్డూ రం. వైసీపీ ఐదేళ్ల పాలనలో శింగనమల నియో జకవర్గానికి జొన్నలగడ్డ పద్మావతి ఎమ్మెల్యేగా కొనసాగారు. ఆమె ఏనాడూ ఈ పాఠశాల వైపు కన్నెత్తి చూసిన పాపన పోలేదని పలువురు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్థితిలవస్థకు చేరుకున్న భవనంలో విద్యార్థులకు ప్రమాదం పొంచిఉందని భావించిన విద్యాశాఖ అధికారులు సమీపంలో ఉన్న ఆర్డీటీ భవనంలో కి పాఠశాలను మార్చారు. అయితే ఒకే గది ఉండటంతో, అందులోనే ఐదు తరగతులకూ ఆ ఇద్దరు ఉపాధ్యాయినులు బోధిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం పాఠశాల అభివృద్ధికి పాటుపడలేదని ఎన్డీఏ ప్రభుత్వమైనా తమ అందుకు కృషి చేయాలని ఆ గ్రామ ప్రజలు, విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

కల్లూరు అగ్రహారంలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పై కప్పు పెచ్చులూడి పడుతోంది. ప్రమాదం జరుగుతుందని ముందస్తు జాగ్రత్తగా సమీపంలో ఉన్న ఆర్డీటీ భవనంలో పాఠశా లను నిర్వహిస్తున్నాం. ఈ విషయాన్ని ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- తారా చంద్రానాయక్, ఎంఈఓ, గార్లదిన్నె

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బంగి నాగ తదితరులు



సైఫుద్దీన్ తదితరులు

అనంతపురం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్‌లో ఎస్సీల సంక్షేమం కోసం భారీగా నిధులు కేటాయించినందుకు తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగి నాగ ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్థానిక హమాలీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల వద్ద సోమవారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషే కం చేశారు. దళిత సంఘాల నాయకులు పృథ్వి, అనిల్ కుమార్, శరత్, రాజేష్, విద్యాసాగర్, మురళీ, సాయి శంకర్, సాయి వర్ధన్, పవన్, భరత్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే బడ్జెట్‌లో మైనార్టీలకు నిధులు కేటాయించినందుకు సోమవారం సాయంత్రం టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైఫుద్దీన్ ఆధ్వర్యంలో స్థానిక సప్తగిరి సర్కిల్ మసీదు వద్ద సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు.

స్వర్ణాంధ్రకు బాటలు వేసేలా బడ్జెట్

అనంతపురం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్ స్వర్ణాంధ్రకు బాటలు వేసే విధంగా ఉందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, టీడీపీ బీసీ సెల్ నాయకులు సిమెంట్ పోలన్న, నాయకులు కురబ నారాయణ స్వామి, నెట్టెం బాలకృష్ణ, కూచి హరి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా బడ్జెట్ ఉందని కొనియాడారు. సూపర్ సిక్స్ పథకాలకు బడ్జెట్‌లు నిధులు కేటాయించడం శుభపరిణామం అన్నారు. ఈ బడ్జెట్‌లో ఏపీ చరిత్రలో ఓ మైలురాయిగా నిలుస్తుందన్నారు.

ఎస్ఈ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఎస్ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, నవంబరు11: ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈగా గుంటూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈగా పనిచేస్తున్న సురేష్‌ను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్ కుమార్ నుండి నెలన్నర క్రితం ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. అయితే ఉత్తర్వులు జారీ అయి నెలన్నర కావస్తున్నా బాధ్యతలు చేపట్టడానికి రాకపోవడంతో ఇక్కడ ఉన్న ఈఈ మురళీధర్‌రావుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఎస్ఈ సురేష్ రాకుంటే పదోన్నతి ప్రక్రియ చేపట్టినప్పుడు ఈఈలుగా ఉన్న వారిలో మరొకరిని నియమించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఎట్టలకేలకు ఎస్ఈ సురేష్ బాధ్యతలు చేపట్టారు. దీంతో పలువురు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

చిత్రకళ ఉపాధ్యాయుడికి విశిష్ట గౌరవం



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు

రామగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గురుకుల పాఠశాల చిత్రకళ ఉపాధ్యాయుడు శ్రీరాములుకు విశిష్ట గౌరవం లభించింది. విజయవాడకు చెందిన ఓ పత్రిక 64 కళల డాట్‌కాం వ్యవస్థాపకుడు కళాసాగర్ రూపొందించిన ఆర్ట్ ఆఫ్ ఏపీ పుస్తకంలో తన పేరు పొందుపరిచినట్లు ఆయన సోమవారం తెలిపారు. విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండల బుద్ధప్రసాద్, పద్మశ్రీ అవార్డు గ్రహీత సీవీరాజ్ చేతులమీదుగా ఈ పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. దీంతో ఆయనకు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- ఆస్పత్రిలో చేర్పించిన డీఎస్పీ



గాయపడ్డ చిన్నారి వద్ద డీఎస్పీ

పుట్టపర్తి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడ్డ తండ్రి కొడుకులను హిందూపురం డీఎస్పీ మహేష్ తన వాహనంలో సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించి.. మానవత్వం చాటుకున్నాడు. అనంతపురానికి చెందిన దేవేంద్ర, అతని కుమారుడు శరత్ సోమవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా.. కొత్తచెరువు- గోరంట్ల మార్గంలో గంటల మారెమ్మ గుడి వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నారి శరత్ తీవ్రంగా, దేవేంద్ర స్వల్పంగా గాయపడ్డారు. అదే సమయంలో పుట్టపర్తికి వస్తున్న హిందూపురం డీఎస్పీ మహేష్ తన వాహనంలో ఆ తండ్రీ కొడుకులను తీసుకెళ్లి.. సత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వారిద్దరిని అనంతపురానికి తరలించారు. పుట్టపర్తి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మహిళల గొడవ.. కేసు నమోదు

అనంతపురం క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చిట్టీ లెక్కల వ్యవహారంపై రెండు వర్గాలకు చెందిన మహిళలపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రూ. 90 వేల చిట్టీకి సంబంధించి మూడు కంతులు చెల్లించలేదంటూ... అంబేడ్కర్ నగర్‌కు చెందిన బాల కదిరమ్మ, ప్రమీల వర్గాలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో వాగ్వాదానికి దిగారు. చివరకు గొడవ పడే పరిస్థితి వచ్చింది. దీంతో పోలీసులు ఇరువర్గాలకు చెందిన ఐదు మందిపై కేసు నమోదు చేశారు.

రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం



స్వామికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపేట రామాలయం ఆవరణలో ఉన్న రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ముత్యాలురెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ప్రాంతాల్లో పోలీసుల గస్తీ

శింగనమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో పెన్నానది వంక ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను తరలించకుండా రెవెన్యూ సిబ్బందితో కలసి పోలీసుల గస్తీ ఏర్పాటు చేశారు. మండలంలోని వంక ప్రాంతాల్లో అక్రమ ఇసుక తరలింపుపై ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ శరత్ చంద్ర పలు గ్రామాల్లోని వంక ప్రాంతాల్లో పోలీసుగస్తీతో పాటు రెవెన్యూ సిబ్బందిని కాపాలా ఉంచారు.

ఇసుక రవాణాను అరికట్టండి

గార్లదిన్నె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొప్పలకొండ గ్రామం నుంచి ఇసుక అక్రమ రవాణాను ఆరికట్టి ఊటకాలువను కాపాడాలని కేశవాపురం గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ బండారు ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఊటకాలువల ద్వారా నీరు రాకపోతే కేశవాపురం గ్రామంలో సుమారు 500 ఎకరాలకు సాగునీరు అందదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు క్రిష్ణయ్య, ప్రకాష్‌నాయుడు, అంజినేయులు, రామాంజినేయులు, పెద్దన్న, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె విద్యార్థుల ప్రతిభ

గార్లదిన్నె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మౌలానా అబుల్ కలామ్ జయంతి వేడుకలను పురష్కరించుకుని సోమవారం అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అబుల్ కలామ్‌పై ప్రసంగం పోటిలు నిర్వహించారు. ఈ పోటీల్లో గార్లదిన్నె ఏపీఆర్ఎస్ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న బషీరుద్దీన్, ఎనిమిదో తరగతి చదువుతున్న సాహిద్ అర్ఫాన్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వారికి కలెక్టర్ బహుమతులు అందచేశారు.

అబుల్ కలాంకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని సోమవారం టీడీపీ నాయకులు ఆయనకు ఘన నివాళులర్పించారు. సోమవారం స్థానిక క్లాక్ టవర్ సమీ పంలోని మౌలానా విగ్రహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొహిద్దీన్, నాయకులు సైఫుద్దీన్, ఫిరోజ్ అహ్మద్, తాజుద్దీన్, సరిపూటి రమణ, కురబ నారాయణస్వామి, మణికంఠ బాబు, ఓంకార్‌రెడ్డి, సరిపూటి శ్రీకాంత్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రత్యేక చొరవతోనే క్లాక్‌టవర్ సమీపంలో అబుల్ కలాం విగ్రహాన్ని తిరిగి ఏర్పాటుచేసినట్లు వారు పేర్కొన్నారు.

● అనంతపురం క్లాక్‌టవర్: ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిన నాయకుడు దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక పాతూరులోని మున్సిపల్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాఠశాలలో పేద విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నసీమా, సొసైటీ కార్యదర్శి షేక్ చాందిని, సహాయ కార్యదర్శి ప్రసిల్లా, సభ్యులు మహేంద్ర, దివ్యతేజ తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం న్యూటౌన్: మౌలానా అబుల్ కలామ్ అజాద్ జయంతి వేడుకలు సోమవారం కాంగ్రెస్ పార్టీ స్థానిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదా గాంధీ ఆధ్వర్యంలో చేపట్టారు. అబుల్ కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ ఇమామ్, సీనియర్ నాయకులు వాసు, ఎన్ఎస్‌యూఐ నాయకులు నరేష్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యాసామగ్రి అందజేస్తున్న ఎస్ఆర్ సొసైటీ సభ్యులు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అదృశ్యమైన వస్తువులు ప్రత్యక్షం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



డ్వామా పీడీ బంగ్లా ఇదే...

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల డ్వామా పీడీ కార్యాలయంలో, పీడీ బంగ్లానుంచి అదృశ్యమైన వస్తువుల్లో కొన్ని వచ్చి చేరాయి. మూడు రోజుల క్రితం అర్ధరాత్రి ఎవరూ లేని సమయంలో రెండు ఏసీలు, టీవీ, ఫర్నీచర్‌ను డ్వామా పీడీ బంగ్లాలోకి ఎవరో తెచ్చి పెట్టారని ఆశాఖ వారే అంటున్నారు. అయితే మొత్తం డ్వామా పీడీ కార్యాలయం, బంగ్లాలో నుంచి ఇటీవల ఎనిమిది ఏసీలు, రూ.10లక్షలకు పైగా విలువ చేసే ఫర్నీచర్‌ను ఎవరో ఎత్తుకెళ్లారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ' మరీ ఇంత కక్కుర్తా... డ్వామాలో దొంగలుపడ్డారు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో విషయం బయటకు పొక్కడం వల్ల వాటిలో కొన్నిటిని తిరిగి చేర్చారు. ఈ తతంగంలో కీలకంగా ఓ ఉద్యోగి ఉన్న ట్లు ఆ శాఖలో అందరూ చర్చించుకుంటున్నారు. కొత్తగా వచ్చిన పీడీకి తెలియ కుండానే కీలక ఉద్యోగి ఇవన్నీ చేశారని చెబుతున్నారు. అయితే అతడికి ఎందుకు ప్రాధాన్యం ఇస్తున్నారనేది తోటి ఉద్యోగుల్లో సందేహం. డ్వామా పీడీ బంగ్లాలోని ఏసీలు, ఫర్నీచర్ తెచ్చిపెట్టారు కానీ... పీడీ కార్యాలయం, కాన్ఫరెన్స్‌హాల్‌లో నుంచి తీసుకెళ్లిన ఏసీలు, ఇతర ఫర్నీచర్ ఎవరి వద్ద ఉన్నాయో తేలాల్సిఉంది.

డిప్యూటీ సీఎం ఫొటో ఎక్కడ..?

- కమిషనర్‌తో జనసేన నాయకులు ● వెంటనే ఏర్పాటు

అనంతపురం క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటో ఎందుకు ఏర్పాటు చేయలేదని జనసేన నాయకులు నగరపాలిక అధికారులను ప్రశ్నించారు. సోమవారం రాత్రి జనసేన పార్టీకి చెందిన కొందరు నాయకులు నగర కమిషనర్ చాంబర్ వద్దకెళ్లి నిలదీశారు. విషయం తెలుసుకున్న కమిషనర్ నాగరాజు తన చాంబర్‌లోకి పిలిపించి మాట్లాడారు. దీంతో వారు మాట్లాడుతూ... తమ నాయకుడు, అహుడా ఛైర్మన్‌గా నియమితులైన టీసీ వరుణ్ ఫ్లెక్సీలను కొన్నింటిని ఎందుకు తొలగించారని కమిషనర్‌ను ప్రశ్నించారు. ఫ్లెక్సీలు ట్రాఫిక్‌కు, ప్రయాణికులకు ఇబ్బందిగా ఉన్న కారణంతో తొలగించాని సంబంధిత అధికారులు చెప్పారు. అనంతరం కమిషనర్ చాంబర్‌లో సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటో ఎందుకు పెట్టలేదని వారు అడిగారు. పెట్టిస్తామని కమిషనర్ చెప్పడంతో వారు వానుదిరిగారు. కొంతసేపటికే కమిషనర్ స్పందించి డిప్యూటీ సీఎం ఫొటోను సీఎం ఫొటో పక్కనే పెట్టించారు.

నేటి నుంచి ధర్మవరం డివిజన్‌లో గ్రామ సభలు

- ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మవరం నియోజకవర్గంతో పాటు రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోనూ గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ఆర్‌డీఓ, తహసీల్దార్, ఇతర మండల అధికారులు గ్రామ సభలకు హాజరవుతారన్నారు. గ్రామాల్లో సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలపై సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

స్కిల్ సర్వే నుంచి తప్పించండి

- వీఆర్‌ఓల వినతి

నార్పల/ రాప్తాడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్ మెంట్ సర్వే విధుల నుంచి తమను తొలగించాలని మండలంలోని వీఆర్‌ఓలు కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అరుణకుమారికి వినతి పత్రం అందజేశారు. అలాగే రాప్తాడు మండలంలోని వీఆర్‌ఓలు సోమవారం తహసీల్దార్‌కు విజయకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే పలు అదనపు విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పుడు ఉన్నతాధికారులు స్కిల్ డెవెలప్‌మెంట్ సర్వేతో వీఆర్వోలను భాగస్వామ్యం చేయడం భావ్యం కాదన్నారు. నార్పలలో వినతి పత్రం ఇచ్చిన వారిలో మండల వీఆర్వోలు శివరాం, పెద్దన్న, వెంకోబరావు, వంశీకృష్ణారెడ్డి, కొండయ్య, రామాంజినేయులు, నిరంజన్‌రావు, చంద్ర, సుకన్య, ప్రభావతి, గాయత్రి, మౌనిక, కీర్తి తదితరులు పాల్గొన్నారు. రాప్తాడులో వీఆర్‌ఓలు లక్ష్మీనారాయణచౌదరి, సరస్వతి, రవికిరణ్, గీతారాణి, శిరీష, ఖుర్దూస్, మనోజ్‌సాయి పాల్గొన్నారు.

నేడు వైద్యకళాశాలలో ఫ్రెషర్స్‌డే

అనంతపురంటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : వైద్యకళాశాల 2024 వైద్యవిద్యార్థుల ఫ్రెషర్స్‌డేకు అతిథులను ఆహ్వానిస్తూ సోమవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణంలో మెడికోలు చేపట్టిన ఫ్లాష్‌మాబ్ అందరినీ ఆకట్టుకుంది. మెడికోలు నృత్యరూపంలో డాన్స్‌లు వేస్తూ అతిథులను స్వాగతించారు. వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపర్‌స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని మెడికోల స్వాగత నృత్యాలు వీక్షించారు. ఫ్రెషర్స్‌డేను వైద్యకళాశాల ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెద్దన్న పోరాటాలు చిరస్మరణీయం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్మికులు, కర్షకుల సమస్యలపై పెద్దన్న చేసిన పోరాటాలు చిరస్మరణీయమని ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా పేర్కొన్నారు. సీపీఐ ఎంఎల్ మాజీ జిల్లా కార్యదర్శి పెద్దన్న స్మారక స్థూపం నిర్మాణ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక రజకనగర్‌లో ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా ప్రారంభించారు. వివిధ సంఘాల నాయకులు చంద్రశేఖర్, మల్లేశ్వరి, సుధాకర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రబీకి పెట్టుబడి సాయం అందించాలి

నార్పల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పెట్టుబడి రాయితీ అన్నదాత సుఖీభవ కింద రైతులకు తక్షణమే రూ. 20వేలు సాయం అందించాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు మాబు, సంజీవరాయుడు, నరసింహారెడ్డి, శ్రీదేవి, రమణారెడ్డి, రసూల్‌బీ, తదితరులు పాల్గొన్నారు.

● చెన్నేకొత్తపల్లి : మండలంలో పంటలను నష్టపోయిన రైతుల ను ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం రైతుసంఘం నాయకులతో కలిసి తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం నాయకులు టి. ముత్యాలప్ప, ముత్యాలప్ప, రాము, నాగరాజు పాల్గొన్నారు.

● రాప్తాడు: రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ విజయకుమారికి వినతి పత్రం అందచేశారు. రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు చలపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరాముడు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

శింగనమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి నేసే మధు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సాకే బ్రహ్మయ్యకు ఆయన చేనేత కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు మధుయాదవ్, చేనేత సంఘం నాయకులు శివశంకర్, గురు, నరసయ్య, దస్తగిరి, ముధురెడ్డి, రమణ తదితరులు పాలొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సీకేపల్లి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీలు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు చెన్నేకొత్తపల్లి ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు పీడీ నల్లప్ప తెలిపారు. ఇటీవల కొత్తచెరువులో నిర్వహించిన అండర్-14,17 జిల్లా స్థాయి పోటీల్లో వారు ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఖోఖో బాలికల విభాగంలో హర్షిణి (అండర్- 14), మధుమిత (అండర్-17), ఉష క్రీడలో చరణ్‌తేజ(అండర్-17) రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. హెచ్ఎం ఓబుళమ్మ, పీడీలు నల్లప్ప, విజయనిర్మల, ఉపాధ్యాయులు వారిని సోమవారం అభినందించారు.

క్లుప్తంగా..

ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ

ఉరవకొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్‌ఐగా జనార్దన్ నాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అలాగే వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్‌ఐగా నాగస్వామి బాధ్యతలు స్వీకరించారు. ఈయన కూడా శ్రీసత్యసాయి జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. మండల ఎస్‌ఐగా నాగేంద్రప్రసాద్

పెద్దపప్పూరు: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్‌ఐగా నాగేంద్రప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఆయన శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు గ్రామశివారులో ఉన్న తోటలో గల పేకాట కేంద్రంపై సోమవారం దాడులు చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ జగదీష్, డీఎస్పీ రామకృష్ణుడు ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి పేకాటకేంద్రంపై దాడులు చేశామని, అందులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామని, అలాగే వారి నుంచి రూ.4.45లక్షల నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. తర్వాతం వారిపై కేసు నమోదు చేశామని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బొమ్మనహాళ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేదావతి హగరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఉద్దేహాళ్ గ్రామ సమీపంలోని వేదావతి హగరి నది నుంచి ఆదివారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఆంధ్ర సరిహద్దు వద్ద పట్టుకున్నామని, అనుమానం రాకుండా ఇసుకపై తెల్లటి డస్ట్ పౌడర్ వేసుకుని ఇసుకను కర్ణాటక రాష్ట్రం బళ్లారికి తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. వెంటనే ట్రాక్టర్‌ను సీజ్ చేసి, ఇసుక తరలిస్తున్న నేమకల్లుకు చెందిన దూదేకుల రాజు, హనుమంతరెడ్డిపై కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

బంకులో చోరీ

గుత్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఓ బంకులో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు బంకుకు రంధ్రం వేసి లోపలికి చొరబడి అందులో ఉన్న రూ. వెయ్యి రూపాయల నగదు, సిగరెట్లు, బీడీలతో పాటు చాక్లెట్లు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

బెళుగుప్ప, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం టీడీపీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదును చురుగ్గా చేపట్టారు. నాయకులు రుద్రయ్య, బాలాజీ, శ్రీరాములు, సతీష్, సంతోష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం

ఉరవకొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి సమీపంలో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధమైంది. అనంతపురం నుంచి బళ్లారి కి వెళ్తున్న లారీలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తం అయి ప్రమాదం నుంచి బయట పడ్డాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. లారీ దగ్ధం కావడంతో రూ.15లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు సమాచారం.

14న దివ్యాంగుల ధర్నా

కణేకల్లు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిదురకుంతం గ్రామంలో విజయ్‌కుమార్ అనే దివ్యాంగుడి ఇంటిని కబ్జా చేసిన కోటిరెడ్డి అనే వ్యక్తి ఇంటి ఎదుట ఈ నెల 14వ తేదీన పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వసంత్‌కుమార్, మండల అధ్యక్షుడు రాజన్న సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వికలాంగుల సంఘం రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొననున్నట్లు చెప్పారు. తమకు అన్ని వర్గాల వారు మద్దతు ఇవ్వాలని వారు కోరారు.

గ్రామాల అభివృద్ధిపై నేటి నుంచి శిక్షణ

రాయదుర్గంరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో గ్రామపంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొండన్న సోమవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా సంఘాల లీడర్లు హాజరు కావాలన్నారు. అదే విధంగా బుధవారం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

నీటికొలనులో పడి విద్యార్థి మృతి

● మహానంది దైవదర్శనానికి వెళ్లి మృత్యువాత


చక్రధర్ రెడ్డి (ఫైల్)

పుట్లూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దైవదర్శనం కోసం వెళ్లిన ఆ కుటుంబంపై విధి చిన్నచూపు చూసింది. ఆ కుటుంబంలోని చిన్నారిని నీటికొలను బలి తీసుకుంది. మండలంలోని శనగలగూడూరు గ్రామానికి చెందిన హరికుమార్ రెడ్డి, భార్య జ్యోతి, కుమారులు చక్రధర్ రెడ్డి (9), విఘ్నేశ్వరరెడ్డితో కలిసి సోమవారం ఉదయం నంద్యాల జిల్లా మహానందికి దైవదర్శనం కోసం వెళ్లారు. అక్కడి కొలనులో చిన్నారులిద్దరికీ వాళ్ల అమ్మ స్నానం చేయించి పక్కన కూర్చోబెట్టింది. అయితే చక్రధర్‌రెడ్డి ప్రమాదవశాత్తూ కొలనులో పడ్డాడు. సమయానికి వాళ్ల నాన్న అక్కడ లేడు. స్థానికులు గమనించి బయటకు తీసేసరికే చిన్నారి అధికంగా నీళ్లు తాగడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. మృతదేహాన్ని రాత్రి స్వగ్రామానికి తరలించారు. ఆ చిన్నారి తాడిపత్రిలోని ఓ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. అతని మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.


తాడిపత్రిలో ప్రత్యేక అలంకరణలో బుగ్గరామలింగేశ్వరుడు


గుంతకల్లులో.. సిద్దేశ్వరస్వామి, విశ్వేశ్వరుడు


అశ్వత్థంలో శ్రీచక్ర భీమలింగేశ్వరస్వామి, అశ్వత్థ నారాయణస్వామి

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

● భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: కార్తీకమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. వేకువజామునే అర్చకులు మూలవిరాట్‌లకు పలు అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని అర్చనలు చేయించారు. అలాగే ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీపకాంతులతో ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి.

ఘనంగా మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి

తాడిపత్రి, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖమంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక షాదీఖానా సమీపంలో ఉన్న అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో మౌలానా అబుల్‌కలాం ఆజాద్ ముఖ్యపాత్ర పోషించారన్నారు. దేశంలో విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజాక్‌వలి, న్యాయవాది హనీఫ్‌బాషా, టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: మౌలానా అబుల్ కలాం జయంతిని పట్టణంలో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక అర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్,


గుంతకల్లులో ఆజాద్ జయంతి వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు, విద్యార్థులు

నాయకులు తలారి మస్తానప్ప, మార్కెట్‌వెంకటేష్, ఆమ్లెట్‌మస్తాన్‌యాదవ్, హనమంతు, ఫ్రూట్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ మైనార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంజుమన్ కమిటీ సభ్యులు ఆర్‌అండ్‌బీ బంగ్లా సమీపంలో ఉన్న విగ్రహం వద్ద నివాళులర్పించారు.

యాడికి: రాయలచెరువులో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ , సభ్యులు నిర్వహించారు. సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

కుందుర్పి: మండలంలో ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విలువలబడుల విద్యార్థులు వివిధ గ్రామాల్లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలానా అబుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటం వద్ద వైస్ ప్రిన్సిపాల్ మస్తాన ప్ప, అధ్యాపకులు నివాళులర్పించారు. అలాగే పంచాయతీ కార్యాలయంలో ఉన్న ఆయన విగ్రహం వద్ద ఆర్ఎంఎం నాయకులు నివాళులర్పించారు.

రాయదుర్గం రూరల్: పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జరిపారు. ప్రిన్సిపాల్ రఘురామమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

గుంతకల్లు టౌన్/ పుట్లూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ. 20వేలు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో సోమవారం ఆర్డీఓ శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందిస్తామని ఎన్నికల్లో ప్రకటించారన్నారు. ఆ హామీని వెంటనే అమలు చేయాలని అన్నారు. అలాగే వెనుకబడిన అనంతపురం జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.10వేల కోట్లు నిధులు కేటాయించాలని, 90శాతం సబ్సిడీతో రైతులకు సేద్యపరికరాలను అందించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి రాముడాయల్ పలువురు నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా పుట్లూరు మండలకేంద్రంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు సత్తార్‌గోపాల్, గోపాలకృష్ణ, చిన్నికృష్ణుడు తదితరులు తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

'పొలాల మీదుగా వాహనాలను తిరగనివ్వం'


రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ

యల్లనూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చిత్రావతినదిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుకరీచ్ నుంచి ఇసుకను తరలించే వాహనాలు తమ పొలాల పైప్‌లైన్ మీదుగా వెళ్లరాదని మండలంలోని తిరుమలాపురం రైతులు సోమవారం ఆందోళన చేశారు. మొదట రీచ్ ఏర్పాటు చేసిన చోట చిలమకూరు గ్రామస్తులు అడ్డుకోవడంతో.. అధికారులు ఆ ప్రాంతాన్ని వదలి మరోచోట నుంచి వాహనాలను తిప్పేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకోసం రెండురోజులుగా నదిలో రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ఇది గమనించిన తిరుమలాపురం రైతులు తమపంట పొలాలకు వేసుకున్న పైపులైన్లపై రోడ్డు వేస్తుండడంతో భారీవాహనాలు వెళితే పైపులైన్లు పగిలిపోయే అవకాశం ఉందని అడ్డు తగిలారు. సోమవారం 12గంటల ప్రాంతంలో సుమారు వందమందికిపైగా వచ్చి నదిలోని రహదారిపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాంప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. దీంతో రైతులు వెళ్లిపోయారు.

టమోటా పంటకు బీమా వర్తింపు

కళ్యాణదుర్గంరూరల్/బెళుగుప్ప/ రాయదుర్గం రూరల్/ బొమ్మనహాళ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రబీలో రైతులు సాగు చేసిన టమోట పంటకు వాతావరణ బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు కళ్యాణదుర్గం, రాయదుర్గం ఉద్యాన అధికారులు కృష్ణతేజ, మౌనిక సోమవారం ప్రకటనలో తెలిపారు. టమోటా పంట సాగు చేసిన రైతులు ఈ క్రాప్ నమోదు చేయించి ఎకరాకు రూ. 1600 ప్రీమియం డిసెంబరు 15 వ తేదీ లోగా చెల్లించాలన్నారు. పంటనష్టం వాటిల్లితే ఎకరాకు రూ. 32 వేలు బీమా వర్తిస్తుందన్నారు. బ్యాంకులో రుణాలున్న రైతులు అక్కడే ప్రీమియం కట్టవచ్చన్నారు. రుణాలు లేని రైతులు ధ్రువీకరణ పత్రాలతో రైతు సేవా కేంద్రాల్లో చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా అధికారి కృష్ణసాగర్ 9912275799ను సంప్రదించాలని వారు సూచించారు.

గేట్స్‌లో కంటి వైద్య శిబిరం

గుత్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం వీకే సుధీర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా కళాశాల, తక్ష్యం స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కడపకు చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి వారు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో దాదాపు 300 మంది పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని వైద్యులు కడపలోని పుష్పగిరి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ఎండీ రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సుధాకర్, స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చందాలు వేసుకుని మురుగునీటి తొలగింపు

బొమ్మనహాళ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహోన్నూరు పంచాయతీ కొత్తపల్లి గ్రామంలోని పురాతన కన్నేరమ్మబావిలో వర్షపు నీరు నిల్వ అయి మురుగుగా మారి దోమలకు నిలయంగా ఉంది. ఈ నీటిని తొలగించాలని గ్రామస్థులు పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలిపారు. అయినా ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదు. దీంతో చేసేదిలేక గ్రామస్థులే చందాలు వేసుకుని బావిలోని నీటిని మోటారు వేసి పైపు దారా బయటకు మళ్లించారు.

15 నుంచి కడ్లే గౌరమ్మ రథోత్సవాలు


కడ్లే గౌరమ్మ అమ్మవారు

విడపనకల్లు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన కడ్లే గౌరమ్మ అమ్మవారి పూల రథోత్సవ వేడుకలను ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు సోమవారం ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 18వ తేదీ వరకు వేడుకలు జరపనున్నట్లు చెప్పారు. ఈ మూడు రోజుల పాటు వేడుకల్లో భాగంగా ఆలయం వద్ద వివిధ పూజలు, క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. 18వ తేదీ తెల్లవారు జామున అమ్మవారిని పూల రథంలో కొలువు దీర్చి ఊరేగింపు చేస్తామని, తర్వాత బావిలో నిమజ్జనం చేస్తామని, ఇంతటితో రథోత్సవ వేడుకలు ముగుస్తాయని పేర్కొన్నారు. వేడుకలకు భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

తాడిపత్రి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలో సోమవారం ట్రాన్స్‌కో ఏడీని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచేదిలేదని ఎన్నికల్లో చెప్పారని, ఇప్పుడేమో సర్దుబాటు పేరుతో ప్రజలపై రూ.6400కోట్ల భారాన్ని మోపాలని చూస్తున్నారని మండిపడ్డారు. ట్రూఅప్‌ఛార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు నరసింహారెడ్డి, హనుమంతరెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాసుదర్శన హోమం

బెళుగుప్ప, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా మహాసుదర్శన హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మలయాళ పండితులు పాల్గొని వేదమంత్రాల నడుమ మహాగణపతి, మృత్యుంజయ, లక్ష్మీ, వినాయక, మహాసుదర్శన హోమాలు జరిపారు. తర్వాత మధ్యాహ్నం గాయత్రి హోమం, గణపతి పూజ చేశారు. గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కరిగానపల్లిలో అంజప్ప జాతర

కుందుర్పి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కరిగానపల్లిలో సోమవారం అంజప్ప జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత పూజరులు ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున వచ్చి స్వామిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కాపరులు మూగజీవాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఇలా పాటిస్తే మూగజీవాలు ఎలాంటి రోగాల భారిన పడవని ఇక్కడి ప్రజల నమ్మకం. తర్వాత రాత్రి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు చేశారు.

ఘనంగా వాల్మీకి జయంతి

బెళుగుప్ప, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరంలో సోమవారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని మందిరంలోని వాల్మీకి విగ్రహం వద్ద పూజలు చేశారు. తర్వాత వాల్మీకులు ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. ఊరేగింపులో మహిళలు జ్యోతులతో పాల్గొన్నారు. అనంతరం పలువురు వాల్మీకులు బెళుగుప్పలో వాల్మీకి కళ్యాణ మండపం మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.


వాల్మీకి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఉరవకొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అరబిక్ స్కూల్ సమీపంలో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం టీడీపీ నాయకులు, అధికారులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ కన్వీనర్ రామాంజనేయులు మాట్లాడుతూ ఉరవకొండలో రూ.2.50కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్య, టీడీపీ నాయకులు ప్యారంకేశవానంద, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి దందా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

యాడికి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి దందాకు పాల్పడి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో పాల్గొని అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గండికోట లక్ష్మణ్, పార్టీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య మాట్లాడుతూ.. యాడికి మండలంలో ప్రభుత్వ భూములు, దేవాదాయ భూముల్లో వైసీపీ నాయకుడు బొంబాయి రమేష్‌నాయుడు మట్టిని పెద్దఎత్తున అక్రమంగా తరలించారని తెలిపారు. చిన్నపేట ఆంజనేయస్వామి మాన్యంలో సర్వేనెంబరు


అసిస్టెంట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

753-1లో మట్టిని పెద్దఎత్తున అక్రమంగా తరలించారని, దీనివల్ల అక్కడ విద్యుత్ సరఫరా చేసే హైటెన్షన్ టవర్ కూలడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయన అధికారాన్ని అడ్డుపెట్టుకొని యాడికిలో అనధికారిక లేఔట్లలోకి గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. బొంబాయి రమేష్‌నాయుడు, అతని అనుచరులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు కోరారు.

పని ఒత్తిడి తగ్గించాలని వినతి

యాడికి/ పెద్దవడుగూరు/బెళుగుప్ప, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సిబ్బందిపై పని ఒత్తిడి తగ్గించాలని మండలంలోని వీఆర్వోలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలో సోమవారం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. తాము చాలా తీవ్ర పనిఒత్తిడి ఎదుర్కొంటున్నామని తెలిపారు. రోజుకు నాలుగైదు రకాల పనులను అప్పజెప్పడం వలన ఒత్తిడితో అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. ఆయకట్టు ఎన్నికల ఓటర్ల జాబితా తయారీ, రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం, పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల ఫీల్డ్ ఎంక్వైరీ, క్యాంపెయిన్, రెగ్యులర్‌గా వచ్చే క్యాస్ట్, ఇన్‌కం, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్‌ల ఎంక్వైయిరీలు ఇతర విధులతో సతమతవుతున్నామని వాపోయారు. పనిఒత్తిడి తగ్గించాలని కోరారు. వీఆర్వోలు రమేష్, కుమార్, రంగస్వామి, రామకృష్ణ, వెంకటరాజు, శివుడు తదితరులు ఉన్నారు. అలాగే పెద్దవడుగూరులో రెవెన్యూ కార్యదర్శులు రామేశ్వర్‌రెడ్డి, సుంకన్న, రమేష్, లక్ష్మీపతి తదితరులు తహసీల్దార్ ఉషారాణికి వినతిపత్రం అందజేశారు. ఇక బెళుగుప్ప మండలకేంద్రంలోనూ వీఆర్వోలు రమేష్, ఈశ్వరరెడ్డి, ఎర్రిస్వామి, రాజశేఖర్, ప్రదీప్, దుద్దేకుంట ఎర్రిస్వామి తదితరులు తహసీల్దార్ షర్మిలకు వినపత్రం ఇచ్చారు. అదేవిధంగా కణేకల్లు మండలకేంద్రంలో తహసీల్దార్ ఫణికుమార్‌కు వీఆర్వో సంఘం నాయకుడు పవన్‌కుమార్, వీఆర్వోలు పర్వీన్, రుద్రప్ప, శ్రీరాములు, సమరశేఖర్, భీమన్న, హనుమంతరెడ్డి వినతిపత్రం అందజేశారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కార్మిక మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న వడ్డెరమేష్

గుంతకల్లుటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ పట్టణాధ్యక్షుడు వడ్డె రమేష్ కోరారు. ఈ మేరకు విజయవాడలోని సచివాలయంలో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పరిష్కరించాల్సిన సమస్యలను ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ పీఏకు వినతి పత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

పెద్దవడుగూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు అప్పేచర్ల, తిమ్మాపురం, లక్షుంపల్లి, దిమ్మగుడి, వీరన్నపల్లి, మిడుతూరు, విరుపాపురం, కోనాపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి 12వ పీఆర్సీకి సంబంధించిన మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహమ్మద్‌రఫీ, వేణుగోపాల్, ప్రసాద్ పాల్గొన్నారు.